# "లంచాల నాన్న"

శ్రీ మున్నంగి రాజగోపాలాచార్యులు

"మీనాన్న లంచాలు కొడ్తున్నాడు కథ రోయ్" అన్నాడు మిత్రుడు. "మానాన్న లంచాలు పట్టినా, అదివేరే విషయం; ఆలంచాలు బాగా డబ్బు సంపాదించే ధనికుల దగ్గరనుంచి లాగుతున్నాడు. దానివల్ల సంఘానికి నష్టమేముంది? వారిదగ్గిరనుంచి ఆలా గుంజాల్సిందే" అన్నాడు శ్రీధర్. "అదే పొరబాటంటాను. ఏరూపాన్నయినా అపకారమే చేస్తున్నాడు మీనాయన; నీవింత చులకనగా ఆలోచించరాదీ విషయం. మీనాన్న వ్యాపారస్థుల దగ్గరే డబ్బుగుంజటము నిజమే కానీ, ఆధనిక వ్యాపారులు నీవు తలచేంతటి పిచ్చిపుల్లయ్యలు కారు. మీనాన్నకిచ్చే డబ్బంతా వస్తువుల ఖరీదు మీదవేసి, అమాయకపు ప్రజల మీద రుద్దుతారు. ఈభారానికి మూలకారకుడు మీనాన్నే" అన్నాడు మిత్రుడు. ఆసంభాషణ తర్వాత శ్రీధర్ ఆలోచనలో మునిగాడు. అతని భావాలు సినీమారీలులాగా గిరున తిరిగి బుర్రను చరిచాయి.

మిత్రుడన్నమాట నిజమే. జీతాలు చాలనప్పుడు ధైర్యంగా పోరాడి, ఎక్కువ జీతాల కొఱకు ప్రయత్నించాలి కానీ, లంచాలు పుచ్చుకోవటము అమాయకపు ప్రజల నోళ్లుకొట్టి పొట్టపోసుకోవటమే అవుతుంది. చీడపురుగుల్లా నాన్నలాంటి వాళ్లు, బీద ప్రజలనే వృక్షాన్ని తొలిచేస్తున్నారన్నమాట. అయినా, నాన్న పుచ్చుకొనే లంచం సంగతివేరు. ఈరోజులలో, పేదల నోళ్లు కొట్టి ధనికులు వ్యాపారరూపేణ సొమ్ము అధికంగా కూడేస్తూన్నారు. ఎట్లయినా సరే లంచం రూపేణ అయినా ఆసొమ్ముని వాళ్లనుంచి ఆలా లాగాల్సిందే. "గ్రుడ్డిలో మెల్ల మేలు" అన్నట్లు, అన్యాయాన్ని అరికట్టాలంటే అన్యాయ పద్ధతితోనే అరికట్టాలి. మన ఉద్దేశ్యం అన్యాయాన్ని రూపుమాపడమేగా? ఆడబ్బునాన్నదగ్గరున్నా దానం ... ధర్మం ... చేయటంలో సద్వినియోగమే అవుతుంది కదా? ...

"నాన్న...దప్పి...బాధ" అని చెల్లాయి మూలుగుతూంది. "అబ్బాయీ! అమ్మాయి చాల క్లిష్టస్థితిలో వుంది. త్వరగా, డాక్టర్ని పిలుచుకొనిరా' అనిన

తల్లిమాటలు, తన ఆలోచనలకు అడ్డు వచ్చాయి. ఈగొడవల్లో చెల్లాయి సంగతి మఱచి ప్రమత్తుడై ఇతర ఆలోచనల్లో దూరి, కాలయాపన మైనందులకు మదన పడ్డాడు. తాను ఉన్నాడని పట్నంలో అన్నీ అందుబాటులో వుంటాయని, చెల్లిని పల్లెటూరునుంచి తన దగ్గరికి తల్లిపిలుచుకొని వచ్చింది. తానూ, చదువుమానేసి, చెల్లెల్ని కనురెప్పలాగా కాపాడుతున్నాడు. అయింటిలో ఆ అమ్మాయి ఒకత్తే కాబట్టి అతి గారాబంగా పెరిగింది. అందరికి ఆమె అంటే అమిత ప్రేమానూ.

మిత్రునితో మాట్లాడటం కట్టిపెట్టేసి, డాక్టరింటికి పరుగెత్తాడు శ్రీధర్. చెల్లెల్ని పరీక్షించాడు డాక్టర్. "తీవ్రమైన జ్వరం. ప్రాణము నీరసించి పోయింది. ఇప్పుడు మీరు పాలు ఇచ్చినా ఇముడ్చుకొనే స్థితిలేని రకంలోవుంది. 'గ్లూకోస్' నీళ్లు తప్ప, ఈ అమ్మాయికి ఆధారం కన్పించదు. దాన్ని ఈమె తెలివికి వచ్చినప్పుడెల్ల, పట్టడం మంచిది" అని అన్నాడు డాక్టరు.

చెల్లాయిని ఎల్లాగైనా బ్రతికించుకోవాలి. తక్షణం బయల్దేరాడు శ్రీధర్, గ్లూకోస్ కొనుక్కొరావటానికి. బజారంతా గాలించినా దొరకలేదు. వట్టిచేతుల్తో ఇంటిమొగం పట్టాడు. "అమ్మా! ఎక్కడికి కెళ్లినా గ్లూకోస్ దొరకలేదు" అన్నాడు. "డాక్టరుగారు దొరుకుతుందన్నారే" అంది తల్లి. "ప్రతిదుకాణాదారు, లేదు అనే అంటూన్నాడు. పోనీ ఎంతయినసరే చాటుగానైనా ఇచ్చికొనుక్కోనిరానాయినా" అంది. "ఎంత ఇస్తానన్నా నన్ను నమ్మేవాడేడీ? అదొంగవ్యాపారమైనా వాళ్లకి, తెలిసినవాళ్లతోనేగానీ చెయ్యరుగా..." అన్నాడు. "మన ఊళ్లో అయితే, దొరికేది. మీనాన్నయితే, ఎల్లాగైనా పట్టుకొచ్చేవాడు." అంది తల్లి. "ఆమాటనిజమే. కానీ ఇక్కడ మన ముఖం చూచేవాడెవడు? అయినా మనకొక్కరికి దొరకితే, చాలా? మనలాంటి వాళ్లెందరు ప్రాణాంతకావస్థ నొందుతున్నారో!" అన్నాడు శ్రీధర్.

చెల్లెలిస్థితి చాల ప్రమాదంగావుంది. సంధి గుణాలు కూడా, కనిపిస్తున్నాయి, కానీ చెల్లెల్ని బ్రతికించుకోవాలి. చివరి ప్రయత్నం చేద్దామని తిరిగి బయల్దేరాడు శ్రీధర్. నాన్న ఉంటే సులభంగా దొరికేదేమోనని పించింది. అయినా నాన్నని మాత్రం ఈపట్నంలో లెక్కపెట్టేదెవరు? ఆ ఊళ్లో గనుక అతని వుద్యోగానికి జడిసి, అదొంగ వ్యాపారులు నాన్న కేది కావాలన్నా ఇస్తూన్నారు. కానీ ఈ ఊళ్లో ఆయన్ని లెక్క చేయరుగా? ఇల్లా ఎందరు బాధ పడుతున్నారో?

ప్రొద్దున్న మిత్రుడన్నట్లు వ్యాపారుల దురాశ, ఉద్యోగుల లంచగొండితనమే, ప్రజలకు, అత్యావసరపు వస్తువులు దొరక

నివ్వక, నానావస్థలు పెట్టూంది. ఎందరికి అవసరమైన వస్తువులు దొరకక ప్రాణాలు పోతున్నాయో. హృదయంలేని వీళ్లకేం పట్టింది? డబ్బువుండీ చెల్లెలి బాధను తాను తగ్గించలేక పోతున్నాడు. ఇక డబ్బులేని వాళ్లసంగతో??? తన చెల్లెలు బాధపడితే ఆహృదయ విహీనులకేం, వాళ్లకు లాభాలు కావాలిగానీ? మిత్రు డన్నట్లు ఈలంచ గొండులు, దొంగ వ్యాపారస్థులు, ప్రజల మానప్రాణముల కొల్లగొట్టుతున్నారు,వాళ్ల రక్తమాంసాలు పంపకాలేసు కొంటూ న్నారు. "గ్లూకోస్" దొరకనివ్వక ఆదొంగ వ్యాపారులు, లంచగొండ్లూ, తన చెల్లి రక్తాన్ని పీలుస్తున్నారు. అటు దొంగ వ్యాపారస్థులు, ఇటు లంచగొండ్లూ, ఇద్దరు తన చెల్లెలి రక్తాన్ని పంచుకొంటున్నారు. వాళ్లూ వీళ్లూ రాక్షసులే. నాన్న పొరబాటే చేస్తున్నాడు. ఆయన తీసుకొనే లంచం, ఎందరి రక్తమై వుంటుందో, అందులో తన చెల్లెలిరక్తంకూడా ఎందుకుండ కూడదూ?

ఆరాక్షస వర్గంలోవున్న తండ్రి కూడా తన చెల్లెలి రక్తాన్ని జుర్రుతూన్నాడన్న మాట, ఛీ...ఛీ...ఆలాంటి మనిషి నాన్న కాడు. అడవిమృగాలైన తమజాతి జంతువుని తినటానికి, సాహసించవు, కానీ ఈక్రూరులలో, తమ జాతిరక్తాన్నే ఆప్యాయమానంగా త్రాగుతూన్నారు. జుర్రుతూ న్నారు. ఈలా, చెల్లెలిమీది మమతతో తికమిక పడ్తూ, తిరిగి కాళీచేతులతో ఇంటి ముందు కొచ్చేసరికి, ఇంటి ముందు జనం మూగి వుండటం చూచాడు. అప్పుడే రైలు నుంచి వచ్చిన తండ్రి ముఖాన గుడ్డపెట్టు కొని, ఒకచోట ఉన్నాడు "నాయనా! పోయరో... బంగారు తల్లీ పోయరో... నాచిట్టితల్లీ రాదుకో...!" అని ఒకటే తల్లిరోదన.

శ్రీధర్ సంగతి గ్రహించాడు. గుండె నీరైంది. దుఃఖాతిశయంచేత కళ్లంట నీళ్లు రాలేదు. నెత్తి నోరూ కొట్టు కొంటూన్న తల్లివైపు, గుడ్లప్పగించి చూస్తూన్నాడు. 'ఏడ్వకమ్మా ఏడ్వకు నీకూ ఆమెకు ఋణం తీరింది. ఆ అమ్మాయి ఆయుస్సు అంతే వుండగా మనమేంచేస్తాం?" అంటూ అమ్మని ఎవరో ఓదారుస్తూన్నారు. ఆమాటలు శ్రీధర్ భరించలేకపోయాడు. దుఃఖం, క్రోధం అతన్ని ఆవహించాయి. "ఆబిడ్డకు ఆయువు లేక చావలేదు. అదుగో! ఆరాక్షసులు, దొంగవ్యాపారులు, లంచగొండ్లు దాని ప్రాణం తీశారు. నాచెల్లెలి రక్తం త్రాగేరు" అని నాన్నను చూచి "నాన్నా! నీవూ చెల్లెల్ని చంపిన వారిలో ఒకడివే. నీవు దాని ప్రాణం తిన్నావ్. నేనిక మీలో వుండలేను" అని, బావురుమంటూ ఏడుస్తూ, బయటికి పోబోయి గడపకి గ్రుద్దుకొని స్పృహతప్పి క్రింద పడ్డాడు.

తెలివి వచ్చేసరికి హాస్పటల్లో వున్నాడు. ప్రక్కన, తల్లీ, తండ్రి వుండటం చూచేడు. "నేను, మీలో వుండలేను.

మీరు ఘోర హింసా రాక్షసులు, లంచ గొండులను, దొంగవ్యాపారులను, చంపేసి, నా చెల్లెలి చావుకు పగతీర్చుకొంటా" అని శ్రీధర్ గొణగ నారంభించాడు. ఎవరో "ఇంకా పైత్యపు మాటలు వదల్లేదు" అనటం విన్నాడు.

"నేనా... పిచ్చా .. పైత్యమా...బుద్ధి లేదు ఆమాట అన్నవాళ్లకి, వారికే తిక్క పైత్యం, అన్నిని. మునుపటి, శ్రీధర్, చెల్లెలుతో పాటు ఎప్పుడో చచ్చిపోయాడు. ఈ శ్రీధర్ క్రొత్తగా పుట్టేడు. మనుష్యుల్ని తినే మనుష్యుల్ని మ్రింగటానికే, ఈ శ్రీధర్ పుట్టాడు." అంటూ, మళ్లీ స్పృహ తప్పేడు శ్రీధర్. అందరూ అవింత ధోరణి అర్థం చేసుకోలేక ఆశ్చర్యపోయారు. ప్రపంచానికి ఏం తెలుసాతని విషయం. నిజ మెరిగిన వారికి తప్ప!



రాజా ప్రొడక్షన్స్ వారి "పుట్టిల్లు" లో
నొక మనోహర దృశ్యము.